క్లుప్తంగా

చిరువ్యాపారులకు తోపుడుబండ్లు అందజేత



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం పెరికల పూడిలో చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే సౌజన్యంతో తోపుడు బండ్లను శుక్రవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీసెల్ గుంటూరు జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంపల గంగాధర్, నూతల పాటి కేశవరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, గంగాధరరావు, ఆళ్ల మహేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలంటూ దండోరా

ఫిరంగిపురం: ఏళ్లు గడుస్తున్నా ఇంటిపన్ను బకాయిలు చెల్లించని గృహయజమానుల వద్దకు వెళ్లి పన్నులు చెల్లించాలంటూ డప్పుతో దండోరా వేయిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పంచాయతీ సిబ్బంది బకాయిలు ఉన్న రాజాపేట, కొండమెట్లబజార్, రసూల్‌పేట ప్రాంతాల్లో గృహాల యజమానుల వద్దకు వెళ్లి నోటీసు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఏళ్లతరబడి పన్ను చెల్లించని వారి నీటి పంపులు డమ్మీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది బాలస్వామి, బి.అశోక్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్కే రూ.లక్ష వితరణ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో మదీనా మసీదు విస్తరణ పనులకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని శుక్రవారం ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన విరాళాన్ని శుక్రవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీసెల్ గుంటూరు జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచ్ షేక్ అజిజున్ మసీదు కమిటీకి అందజేశారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి, కొలనుకొండ గ్రామాల్లోని కొన్ని ప్రాంతాలకు సరిగా తాగునీరు అందకపోవడంతో సచివాలయ సిబ్బంది సూచనల మేరకు కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా శుక్రవారం నీరు సరఫరా చేసింది. కుంచనపల్లి ఎస్సీ కాలనీ, కొలనుకొండ కత్తులపేట ప్రాంతాల ప్రజలకు సురక్షిత నీటిని అందించింది.

ఈనెల 3న పింఛన్ల పంపిణీ

మంగళగిరి: నగరంలోని లబ్ధిదారులకు ఈనెల 3న పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు నగర కమిషనర్ యు.శారదాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ 2022–23 ఆర్థిక సంవత్సరం ప్రారంభ రోజు, 2వ తేదీ ఆదివారం సెలవు కావడంతో బ్యాంకులకు సెలవులు ఉంటాయని, అందువల్ల 3న అందరికీ పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికురాలికి తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లి ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం తాడేపల్లి గేటు సెంటర్‌లో నివాసముండే పిడుగు లక్ష్మి విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తుండగా ఉండవల్లి సెంటర్‌కు నడుచుకుంటూ వెళ్లింది. ఈ సమయంలో విజయవాడ నుంచి అతివేగంగా వస్తున్న స్కూటీ ఢీకొనడంతో ఆమె ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. 108 సిబ్బంది వైద్యం నిమిత్తం లక్ష్మిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

పెదవడ్లపూడి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంగళగిరి: పెదవడ్లపూడి మెయిన్ కాలువ లాకుల వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గురువారం రాత్రి కనుగొన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 35ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు మృతదేహం నీటిపై తేలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. వీఆర్‌ఓ రంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

తాడేపల్లిరూరల్ : ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కుంచనపల్లి అంబేడ్కర్ సెంటర్ వద్ద మైకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శి వర్గ సభ్యులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేద్దాం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం
- అధికారులతో ఎమ్మెల్యే ఆర్కే సమీక్ష



నగర పాలకసంస్థ కార్యాలయం కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే. చిత్రంలో కమిషనర్ శారదాదేవి, డీఎస్పీ రాంబాబు

మంగళగిరి: నగరం అభివృద్ధి చెందాలంటే రోడ్ల విస్తరణతోపాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆర్కే గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత రాజీవ్ గృహ కల్ప రోడ్డు వద్ద నిర్మితమవుతున్న మగ్గాల షెడ్ల నిర్మాణాలపై జౌళి శాఖ అధికారులతో సమీక్షించారు. మగ్గం షెడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు గౌతమబుద్ధా రోడ్డు విస్తరించి కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. గౌతమబుద్ధారోడ్డుపై వీధివ్యాపారులు, తోపుడుబండ్లవారు, వినియోగదారుల వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పాతబస్టాండ్ ఆవరణలో నిర్మితమవుతున్న ప్రగడ కోటయ్య, డాక్టర్ వైఎస్సార్ చేనేత భవనం కొద్ది రోజులలో పూర్తి కానుందని చేనేత బజార్ పూర్తయిన వెంటనే తెనాలి రోడ్డులోని దుకాణాలను తరలిస్తామని చెప్పారు. ఆ వెంటనే తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. మరో వారంలో నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కల భాగవతుల వారి వీధి విస్తరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. కుక్కలు, పందులు, ఆవుల సంచారంపైనా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిడమర్రు రైల్వే గేటు వద్ద డంపింగ్ యార్డులోని చెత్తను వెంటనే తరలించాలని, అక్కడ పార్కు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం చేనేత బజార్ మూడో అంతస్తు శ్లాబు నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో కమిషనర్ యు. శారదాదేవి, నార్త్ జోన్ డీఎస్పీ జె.రాంబాబు, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలలు బడిలోనే ఉండాలి

హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి లత



మహిళలకు చార్ట్ ద్వారా అవగాహన కల్పిస్తున్న హ్యూమన్ రైట్స్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : బాలలు బడిలోనే ఉండాలని, బయట కాదని గుంటూరు హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి లత చెప్పారు. శుక్రవారం గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో తాడేపల్లి అమరారెడ్డి, ఎస్టీ యానాదుల కాలనీలో పేరెంట్స్ ఎడ్యుకేషన్ చైల్డ్ ప్రొటెక్షన్ సిస్టమ్ గురించి అవగాహన సదస్సుని ర్వహించారు. ముఖ్య అతిథిగా లత మాట్లాడుతూ బాలలందరూ చదువుకోవాలన్నారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.అనూష మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఎవరైనా పిల్లలు బిక్షాటన చేస్తూ, ప్రమాదకరమైన పనుల్లో ఉంటే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారాన్ని అందించాలని సూచించారు. పెదకాకాని మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్ బి.విజయలక్ష్మి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. మంగళగిరి మండల ఫెసిలిటేటర్ నేలటూరి నాగమణి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో తుళ్లూరు మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్ డి.అనిల్, ఎస్టీ కాలనీ మహిళలు, పురుషులు, మోటివేషన్ టీచర్ ఎం.పావని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ బాబు
- చలపతి కళాశాలలో ఘనంగా ప్రారంభమైన నేషనల్ లెవల్ టెక్‌ఫెస్ట్ ఉద్ఘోష్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌బాబు

మోతడక(తాడికొండ): విద్యార్థులు తమలోని సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంచుకొని పాన్ ఇండియా స్థాయిలో పోటీపడేలా ఎదగాలని టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.శ్రీధర్ బాబు అన్నారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రారంభమైన నేషనల్ లెవల్ టెక్‌ఫెస్ట్ 'ఉద్ఘోష్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుకుంటూ నిజాయితీగా సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని, తల్లిదండ్రులు తమని చూసి గర్వపడేలా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.రంగారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ వి.నాగ గోపిరాజు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ బి.తులసీ రాణి, స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ డి.రాము పాల్గొన్నారు.

ముందస్తు ఎన్నికలను స్వాగతిస్తాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



పాత బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

మంగళగిరి: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలను స్వాగతిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. అమరావతి రైతులకు మద్దతుగా మంగళగిరి నుంచి నవులూరు, యర్రబాలెం, పెనుమాక, కృష్ణాయపాలెం, వెంకటపాలెం మీదుగా మందడం వరకు సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మంగళగిరిలో ర్యాలీని ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు పెడితే స్వాగతిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, గని, మారుతీ వరప్రసాద్, కాసా రాంబాబు, కోట మాల్యాద్రి, శివారెడ్డి, కేవీవీ ప్రసాద్, మేడా హనుమంతరావు, జమలయ్య, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో తపాలాశాఖ కీలకపాత్ర

ఐపీఓఎస్ డైరెక్టర్ ఆదిత్య కుమార్ నాయక్



మాట్లాడుతున్న ఐపీఓఎస్ డైరెక్టర్ ఆదిత్య కుమార్ నాయక్

తాడికొండ: దేశ కమ్యూనికేషన్‌కు వెన్నెముకగా నిలిచి 150 ఏళ్లుగా దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో పోస్టాఫీసు సేవలు కీలకపాత్ర పోషించాయని ఐపీఓఎస్ డైరెక్టర్ ఆదిత్య కుమార్ నాయక్ చెప్పారు. తుళ్ళూరు మండలం ఐనవోలు వీఐటీ–ఏపీ విశ్వ విద్యాలయంలో శుక్రవారం సబ్ పోస్టాఫీస్ సేవలను ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. 1,55,000 కంటే ఎక్కువ పోస్టాఫీసులతో భారతీయ తపాలా శాఖ ప్రపంచంలోనే అత్యంత విస్తృత నెట్‌వర్క్‌ని కలిగి ఉందని పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ తమ అభ్యర్థనను పరిశీలించి యూనివర్సిటీలో సేవలను ప్రారంభించిన పోస్టల్ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, ఏపీఎంజీ స్టాఫ్ అండ్ విజిలెన్స్ ఏపీ సర్కిల్ శివ నాగేశ్వరరావు, గుంటూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరిండెంట్ టి వీరరాఘవులు, అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్ట్స్ శ్రీనివాస్, మంగళగిరి పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.5లక్షలతో షెడ్ నిర్మాణం



తాడేపల్లిరూరల్ : స్థానిక క్రిస్టియన్ పేటలో అందరికీ ఉపయోగపడేలా కార్పొరేషన్ అధికారులు శుక్రవారం షెడ్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. క్రిస్టియన్ పేటలోని లూథరన్ చర్చి, అంగన్‌వాడీ స్కూల్, ఏఎన్ఎమ్ సెంటర్ ఒకే చోట ఉన్నాయి. ఆదివారం లూథరన్ చర్చిలో ప్రార్థనలు జరిగే సమయంలో భక్తులు రోడ్డుపై వరకు వస్తున్నారని, మిగిలిన రోజుల్లో అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులు రోడ్డుపై ఆడుకుంటున్నారు. ఏఎన్ఎం సెంటర్ చిన్నది కావడంతో వచ్చిన వారు రోడ్డుపై కూర్చుంటున్నారు. దీంతో స్థలాభావంపై స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన చర్చి, అంగన్‌వాడీ, ఏఎన్ఎమ్‌లకు కలిపి భారీ షెడ్ నిర్మాణం చేయాలని, ఆ షెడ్డు కూడా రోడ్డుపై రాకపోకలు సాగించేవారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని సూచించడంతో కార్పొరేషన్ అధికారులు రూ.5.5 లక్షలతో భారీ షెడ్‌ను నిర్మించి క్రిస్టియన్‌పేట ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేఎల్‌యూలో ఫెస్ట్‌లు ప్రారంభం

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో పలు విభాగాల ఫెస్ట్‌లను శుక్రవారం ప్రారంభించినట్టు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి చెప్పారు. ఎంబీఏ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ తక్షయా ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా టెక్ మహీంద్ర రిక్రూట్‌మెంట్ అధిపతి డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. మేనేజ్‌మెంట్ నైపుణ్యాల గురించి వివరించారు. ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ లలిత కళల విభాగంలో సినీ ఫిలియో ఫెస్ట్ నిర్వహించామని పేర్కొన్నారు. విజువల్ కమ్యూనికేషన్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు బాహుబలి సినిమాలోని మాహిష్మతి సెట్ సూక్ష్మ రూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనతో పాటు విజువల్ కమ్యూనికేషన్ విద్యార్థుల ఛాయాచిత్రాలు, పెయింటింగ్‌తో కూడిన ఫొటో గ్యాలరీ అదరిని ఆకట్టుకుంది. అనంతరం విజువల్ కమ్యూనికేషన్ విద్యార్థులు రచించిన ఫిల్మ్ మేకింగ్ పుస్తకాన్ని, బిగినర్స్ గైడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య, సదస్సు కన్వీనర్ జె.వెంకటరమణ, కో–కన్వీనర్ డాక్టర్ శ్యామ్‌సుందర్ త్రిపాఠి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.25 లక్షలు

- ప్రారంభమైన పనులు
- మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో సురక్షిత మంచినీరు



కొత్తగా వేసిన బోరుల్లో విద్యుత్ సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను బిగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : కొలనుకొండలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు 25 లక్షల రూపాయలు కేటాయించారు. శుక్రవారం ఈ పనులు ప్రారంభించారు. నెల రోజుల క్రితం ఎమ్మెల్యే ఆర్కే కొలనుకొండలో పర్యటించినపుడు కత్తులపేట, ఇందిర నగర్, అక్ష నగర్‌లలో తాగునీరు సరిగా రావడం లేదని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ఆర్కేకు విన్నవించారు. దీంతో ఆయన అధికారులతోను, కొలనుకొండ సచివాలయ సిబ్బందితో సమావేశమై పరిష్కారమార్గాలను అన్వేషించారు. రెండు బోర్లను ఏర్పాటు చేసి ఇందిరనగర్, అక్ష నగర్‌లలో పైపులైను ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయవచ్చని ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి సూచించారు. వెంటనే డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ కొలనుకొండలో పర్యటించి, ఇందిరనగర్, అక్ష నగర్‌లో 800 మీటర్ల పొడవున జీఏ పైపులైను, వాటర్ ట్యాంక్ వద్ద ఒక బోరు, కత్తుల పేటలో మరో బోరును ఏర్పాటు చేసి మోటార్లను ఏర్పాటు చేయాలని నిర్ధారణకు వచ్చారు. ఎమ్మెల్యే ఆర్కేకు రూ.25 లక్షలు కేటాయించి పనులు చేపడితే వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించవచ్చని సూచించి పనులను ప్రారంభించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

మంగళగిరి: గ్రామాభివృద్ధిలో భాగస్వాములై సేవ చేస్తే దేశానికి సేవ చేసినట్లేనని నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిశేఖర్ తెలిపారు. నగర పరిధిలోని బేతపూడి గ్రామంలో వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1 ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక సేవా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రవి శేఖర్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగంలో చేరి గ్రామాల్లో సేవ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వి వెంకట తాతారావు, ప్రెసిడెంట్ ఇసునూరి చంద్రమోహన్, హైకోర్టు న్యాయవాది దామర్ల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ఏఎస్ఐకి ఎస్ఐగా ఉద్యోగోన్నతి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి ఏఎస్ఐగా పనిచేస్తున్న మధుసూదనరావుకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి వచ్చింది. శుక్రవారం జిల్లా ఉన్నతాధికారుల నుంచి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఉత్తర్వులు అందాయి. మధుసూదనరావు పల్నాడు జిల్లాలో ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయనను తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐలు, ఎస్ఐలు అభినందించారు.

రన్ ఫర్ జీసస్ జయప్రదం చేద్దాం



రన్ ఫర్ జీసస్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 8న శనివారం నగరంలో నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కోరారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో రన్ ఫర్ జీసస్ వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆర్కే శుక్రవారం ఆవిష్కరించారు. నిర్వాహకులు పాస్టర్ తిమోతి మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పుర వీధుల్లో ప్రభువును స్తుతిస్తూ క్రైస్తవ ఐక్యతను చాటేందుకు జరగనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 8 శనివారం ఉదయం 6 గంటలకు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ప్రారంభమై పలు కూడళ్ల మీదుగా మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మల్లవరపు రమేష్, పాస్టర్ కెకె రవికుమార్, ఏవీఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్‌కుమార్



సచివాలయ కన్వీనర్‌లకు కిట్లు అందజేస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ చెప్పారు. శుక్రవారం గుంటూరు భారత్ పేటలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్‌ల సమావేశంలో బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 1 నుంచి 5 వరకు మండల ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో సచివాలయాల వారీగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జగనన్నే మా భవిష్యత్తుపై ప్రచార కార్యక్రమం చేపట్టాలని వివరించారు. అందరూ గడపగడపకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల జగనన్న సచివాలయ కన్వీనర్‌లు తాళ్ళ శ్రీనివాసరెడ్డి, బండిప్రసాద్, పెరికల మరియ బాబు, షేక్ అబ్బాస్ పాల్గొన్నారు.

జన సంక్షేమమే జగనన్న ధ్యేయం

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



పథకాల గురించి వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చెప్పారు. పొనుగుపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరిచిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పి.మధుసూదనరావు, మరియబాబు, టి.లక్ష్మయ్య, జోజిబాబు, జి.కోటేశ్వరరావు, టి.పున్నారావు, బి.శ్రీనివాసరెడ్డి, పి.మధుసూదనరావు, సీహెచ్ చంద్రం, ఎం.సుధాకరరెడ్డి, ఎస్.నాగరాజు, ఎస్.హబీబుల్లా, సీహెచ్ బాపూజీరెడ్డి, షేక్.సలీం, చేవూరి రామమోహన్‌రెడ్డి, వి.పిచ్చిరెడ్డి, బుచ్చిరెడ్డి, నాగరత్నం, జాకీర్, బాజీ, మస్తాన్‌వలి, అప్పిరెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీవో డి.అనూరాధ, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.

ముగిసిన ఆర్కిటెక్చర్ జాతీయ సదస్సు



ముగింపు సభలో పాల్గొన్న ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు, విభాగ అధిపతులు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో కేఎల్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథులుగా బ్యాంబు ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్కిటెక్ట్ నీలమ్ మంజునాథ్, ఆర్కిటెక్ట్ రిషాబ్ వాద్వాలు విచ్చేశారు. నీలమ్ మంజునాథ్ ప్రకృతిని కాపాడుకుంటూ కట్టడాలు ఎలా కట్టాలి అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. రిషాబ్ వాద్వా ఆర్కిటెక్చర్ రంగంలో నూతన విధానాలను, మేటా వర్క్ ప్రాముఖ్యాన్ని విశదీకరించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, వర్క్‌షాప్, డిబేట్స్ నిర్వహించారు. ఆర్కిటెక్చర్ విభాగ అధిపతి ప్రియా మాట్లాడుతూ ప్రభుత్వ నేషనల్ మాన్యుమెంట్ అథారిటీతో గజిట్‌లో అధికారికంగా ప్రకటించినట్టు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెకంటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, ఆర్కిటెక్చర్ విభాగ డిప్యూటీ అధిపతి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం అవసరం



రక్త నమూనాలను తీసుకుంటున్న ఫార్మసీ వలంటీర్లు

తాడేపల్లిరూరల్ : ప్రతిఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్‌ను తెలుసుకోవాలని కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.చక్రవర్తి చెప్పారు. శుక్రవారం ప్రాతూరులో ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శి బి.సుబ్బారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ నరేష్, డాక్టర్ నరేంద్రల సహకారంతో గుండిమెడ గ్రామంలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు అభినందించారు.

జంగిల్ క్లియరెన్స్



తాడేపల్లిరూరల్ : నూతక్కి దుగ్గిరాల మండలం పెరికల పూడి మధ్య ఉన్న రహదారిలో శుక్రవారం కార్పొరేషన్ ఆధ్వర్యంలో జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. పెరికలపూడిలో ఎమ్మెల్యే ఆర్కే పర్యటించినపుడు ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉందని, ప్రస్తుతం పంట పొలాల్లో పసుపు, ఇతర పంటలను తరలించేందుకు భారీ వాహనాలు వస్తున్నాయని, రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరడంతో స్పందించిన ఆయన నూతక్కి పెరికలపూడి మధ్య జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. దీంతో కార్పొరేషన్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.